క్లుప్తంగా

మద్యం దుకాణాలకు 799 దరఖాస్తులు


పి అశోక్‌కుమార్ ఎక్సైజ్ సీఐ

చింతలపూడి: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాలకు సంబంధించి 799 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ పి అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. దరఖాస్తు రుసుం ద్వారా రూ.15.98 కోట్లు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. చింతలపూడి మండలంలో నగర పంచాయతీతో కలిపి 5 మద్యం దుకాణాలకు 246 దరఖాస్తులు, కామవరపుకోట మండలంలో 4 షాపులకు 185 దరఖాస్తులు, ,లింగపాలెం మండలం 4 షాపులకు 194 దరఖాస్తులు, టి నరసాపురం 3 షాపులకు 174 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల సమక్షంలో సోమవారం లాటరీ తీసి దుకాణాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

బుట్టాయగూడెం: దేవీ నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా రెడ్డిగణపవరం కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

పల్లకీ బహూకరణ


స్వామికి బహూకరించిన పల్లకీ

కొయ్యలగూడెం: పరంధాముడైన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామికి దాతలు పల్లకీని బహూకరించారు. ప్రగళ్లపాటి వీర వెంకట నాగరాజు, ఉమామహేశ్వరి దంపతులు, వారి కుమారుడు నంద దానసాయి సుమారు లక్ష రూపాయల వ్యయంతో టేకు ఊయల అందించారు. పాలకమండలి చైర్మన్ మద్దు గోపి, ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల విత్తనాల పంపిణీ


కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం మండలం కొండ్రుకోట పునరావాస కేంద్రంలో కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో ఐటీడీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి.అనిల్ కుమార్ పునరావాస కేంద్రంలోని 200 గిరిజన కుటుంబాలకు విత్తనాలను అందించారు. పెరటి మొక్కల పెంపకంలో భాగంగా పంపిణీ చేయడం జరిగిందని అనిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎం .ఫిలోమాన్ తదితరులు పాల్గొన్నారు.

మందుల విరాళం


శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రంలో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు మందులను అందజేస్తున్న దాత

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రథమ చికిత్సా కేంద్రానికి ఒక భక్తుడు ఆదివారం మందులను విరాళంగా అందజేశారు. తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 3 వేల మంది భక్తులకు సరిపడా మందులను ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. స్వామివారి ఆశ్వయుజమాస తిరుకల్యాణ మహోత్సవాలకు, అలాగే కాలినడకన ఆలయానికి వచ్చే భక్తులకు ఈ మందులను వినియోగించాలని దాత అధికారులను కోరారు.

సర్పంచ్ బాలరాజు మృతి పార్టీకి తీరని లోటు


తెల్లం బాలరాజు మాజీ ఎమ్మెల్యే

కుక్కునూరు: రోడ్డు ప్రమాదంలో వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు మృతి చెందడం పట్ల పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్పంచ్ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఆయన స్థానిక నాయకులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ జగిడి బాలరాజు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని అన్నారు. క్రమశిక్షణ కలిగిన యువనాయకుడ్ని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు పర్యాయాలుగా వైఎస్సార్ సీపీ మద్దతుతో అత్యధిక మెజారిటీతో సర్పంచ్‌గా గెలుపొందిన జగిడి బాలరాజు కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

ఇక గిరిపల్లెల్లో ఫుల్లు కిక్కు

- నియోజకవర్గంలో 18 మద్యం షాపుల కేటాయింపు
- గ్రామాల్లో రెట్టింపు కానున్న మందుబాబుల వీరంగాలు


మద్యం సీసాలు

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేసే విధంగా కృషి చేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం మద్యాన్ని గ్రామాల్లో ఏరులై పారించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే మద్యం షాపుల ఏర్పాటుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా ముగిసింది. గత ప్రభుత్వంలో పర్మినెంట్ రూమ్‌లు ఏర్పాటు చేసి వాటిల్లో మద్యం అమ్మకాలు జరిగేవి. అయితే ఆ విధానానికి కూటమి ప్రభుత్వం మంగళంపాడి ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తుంది.

షాపుల కేటాయింపు ఇలా..

నియోజకవర్గంలో 18 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. అయితే గతంతో పోల్చుకుంటే బుట్టాయగూడెం మండలంలో అదనంగా ఒక షాపు పెరగనుంది. ప్రస్తుతం బుట్టాయగూడెం మండలంలో నందాపురం, బుట్టాయగూడెం, రామారావుపేట సెంటర్‌లో మద్యం షాపులు ఉన్నాయి. ఆయా గ్రామలతో పాటు దొరమామిడిలో కూడా కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. అదేవిధంగా కుక్కునూరు మండలంలో ఒక షాపు ఉండగా, అదనంగా మరొక షాపు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా కొయ్యలగూడెం మండలంలో 5, పోలవరం మండలంలో 3, జీలుగుమిల్లి మండలంలో 2, వేలేరుపాడు మండలంలో 1, టి.నర్సాపురం మండలంలో 3 చొప్పున మొత్తం 18 మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయి.

గ్రామాల్లో మందుబాబుల వీరంగాలే

ఇప్పటివరకూ ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ఒక్కొక్కరికీ మూడు సీసాలు మాత్రమే మద్యం విక్రయించేవారు. కానీ ఇకపై ప్రైవేటు పరం కావడంతో మందుబాబులకు నిబంధనలు లేకుండా ఎన్ని సీసాలు కావాలంటే అన్ని మద్యం సీసాలు విక్రయిస్తారు. దీనితో గ్రామాల్లో మందుబాబుల వీరంగాలు రెట్టింపు కావడం ఖాయమంటూ పలువురు అంటున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

జంగారెడ్డిగూడెం: విద్యార్థిని చదువు నిమిత్తం దాత నాటకశాల వెంకటరాజు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందించారు. స్థానిక ఎంబీ షోషల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని పాలడుగుల ఐశ్వర్యకు కాలేజ్, హాస్టల్ ఫీజుల నిమిత్తం రూ.1.40 లక్షలను వెంకటరాజు అందజేశారు. దాత నాటకశాల వెంకటరాజును ఎంబీ సోషల్‌క్లబ్ సభ్యులు అభినందించారు.

బిక్ష ఏర్పాటు పుణ్యఫలం

కామవరపుకోట: మాలాధారణ చేసిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేయటం పుణ్యఫలాన్ని కలుగజేస్తుందని గురవాయిగూడెం అయ్యప్ప ఆలయ ట్రస్ట్ చైర్మన్ రామిరెడ్డి అన్నారు. కామవరపుకోట శ్రీ వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో 8వ సంవత్సర భిక్ష కార్యక్రమాన్ని రామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గురుస్వామి కాల్నిడి రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్‌ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై షేక్ జబీర్

జంగారెడ్డిగూడెం: అసాంఘిక కార్యక్రమాలు విడనాడి బాధ్యత కలిగిన పౌరులుగా జీవించాలని ఎస్సై షేక్ జబీర్ అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరప్రవృత్తిని విడనాడాలని రౌడీషీటర్లకు హితవు పలికారు. ఒకసారి పోలీస్ రికార్డుల్లో నమోదైతే, అనంతర పరిణామాలు వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తాయన్నారు. రౌడీషీట్‌లు తెరబడిన వ్యక్తులు సమాజానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలిగితే వారిపై ఉన్న రౌడీషీట్లను ఎత్తివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం రౌడీషీట్లు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబసభ్యులతో ఎస్సై మాట్లాడారు. నేరప్రవృత్తిని కొనసాగిస్తే కలిగే పరిణామాలను, ఇబ్బందులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చి అప్పారావు పేరు తొలగింపు అన్యాయం


గొర్రెపాటి బుచ్చి అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతలపూడి: తాటిపూడి రిజర్వాయర్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును కొనసాగించాలని తాండ్ర పాపారాయుడు వెలమ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ గొర్రెపాటి బుచ్చి అప్పారావు 111వ జయంతిని స్థానిక వెలమపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు,. స్థానిక తాండ్ర పాపారాయుడు విగ్రహం వద్ద బుచ్చి అప్పారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాండ్ర పాపారాయుడు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్నేపల్లి అప్పారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజి పిలుపులో భాగంగా అప్పారావు చేసిన సేవలను వివరించారు. మానవతావాదిగా, సంఘ సంస్కర్తగా అనేక సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. గత ప్రభుత్వం అప్పారావు సేవలను గుర్తించి తాటిపూడి రిజర్వాయర్‌కు ఆయన పేరును పెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ జీఓను రద్దు చేసి పేరును తొలగించడం స్వాతంత్ర్య సమర యోధుడ్ని అవమాన పరచడమేనన్నారు. తక్షణం తాటిపూడి రిజర్వాయర్‌కు అప్పారావు పేరును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వంగపండు వివేకానంద, డోకల రాము, బోను ఉమామహేశ్వరరావు, గొట్టాపు బాబు, పూడి సుబ్బారావు, కె దుర్గారావు, గంటా తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలను గెంటివేసే కుట్రలను వ్యతిరేకించాలి


గోగుమిల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

బుట్టాయగూడెం: వన్యప్రాణుల సంరక్షణ పేరుతో అడవుల నుంచి ఆదివాసీలను గెంటివేసే కుట్రలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన గోగుమిల్లిలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శనివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అడవి తల్లిని నమ్ముకుని ఆదివాసీ కొండరెడ్డి గిరిజనులు తరతరాలుగా దశాబ్దాల నుంచి జీవిస్తున్నారన్నారు. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని పోడు కొట్టుకుని పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వాలు పాపికొండల అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణ పేరుతో అడవుల నుంచి కొండరెడ్డి గిరిజనులను గెంటి వేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఈ విధానాలను మానుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కెచ్చెల ముక్కారెడ్డి, మడి శ్రీరాములు, వివిధ గ్రామాలకు చెందిన కొండరెడ్డి గిరిజనులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ దర్శనం

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని .. చల్లగా చూడమని అమ్మవారిని ప్రార్థించారు. గత రెండు రోజులుగా వర్షాలు అడపాదడపా కురుస్తుండడంతో తక్కువమంది భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు.


గుబ్బలమంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం విజయదశమి పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి, బాలభోగ నివేదన నిర్వహించారు. దసరా సందర్భంగా శమీపూజ, శ్రవణ నక్షత్రం కావడంతో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భవాని దీక్షాదారులు, అయ్యప్ప దీక్షాదారులు అధిక సంఖ్యలో విచ్చేయగా, గోవింద నామ స్మరణంతో ఆలయం మార్మోగినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. నిడదవోలుకు చెందిన పొదిలి సత్యవతి కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేసినట్లు అర్చకులు నల్లూరు కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, రెడ్డి రంగప్రసాద్, వాసవి సాయినగేష్, కంది బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: హమాలి, ఆటో, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఉద్యోగ కార్మిక సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 18న విజయవాడలో తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆదివారం గోడప్రతులను బోసు బొమ్మ సెంటర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు వెంటనే తెరవాలని, స్కీం వర్కర్స్, కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు జరుగుతుందని, కర్ణాటక హైకోర్టు ప్రముఖ న్యాయవాది కార్మిక నాయకులు కామ్రేడ్ బాలన్, ఇఫ్టూ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.ప్రసాద్, కె.పోలారి తదితరులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. అన్ని వర్గాల ఉద్యోగ కార్మిక వర్గాలు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


కొయ్యలగూడెం: నరసన్నపాలెంలో రాజరాజేశ్వరీ దేవిగా కనకదుర్గమ్మ


జంగారెడ్డిగూడెం: పూజలందుకున్న విజయ చాముండేశ్వరి అమ్మవారు


జంగారెడ్డిగూడెం: రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో గంగానమ్మ తల్లి


జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో అమ్మవారికి పూజలు

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో బోనాలతో వెళుతున్న భక్తులు


టి.నరసాపురం: కనకదుర్గమ్మను ఘనంగా ఊరేగిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: గంగానమ్మ తల్లికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. పది రోజులుగా విశేష అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. శనివారం క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ, స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీవారి క్షేత్రంలో ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టు నిర్వాహకులు శనివారం సాయంత్రం అట్టహాసంగా వాసవీమాత దివ్య రథోత్సవం నిర్వహించారు. రథంలో కొలువైన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తరించారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఆళ్వార్ సదనంలో శనివారం అన్నసమారాధనను నిర్వహించారు.ఆదివారం క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఊరేగింపు వేడుక అట్టహాసంగా జరిగింది.

బయ్యనగూడెంలో బోనాలతో ఊరేగింపు

కొయ్యలగూడెం: బయన్నగూడెం గ్రామంలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా గత పదేళ్లుగా నిర్వహిస్తున్న బోనాల జాతర కార్యక్రమాన్ని విజయదశమి సందర్భంగా నిర్వహించారు. రెండువేల మందికి పైగా మహిళలు బోనాలను శిరస్సులపై పెట్టుకుని పెద్ద రామాలయం నుంచి సరిపల్లి రోడ్డులోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. కొయ్యలగూడెం, నరసన్నపాలెం, వై.జంక్షన్, బయ్యనగూడెం, కన్నాపురం, రాజవరం, పొంగుటూరు, యర్రంపేట, అచ్యుతాపురంలలో దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. కొయ్యలగూడెంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం అన్న సమారాధన నిర్వహించనున్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత గంగానమ్మ, నూకాలమ్మ, విజయదుర్గమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరి, ముత్యాలమ్మ అమ్మవార్లను శనివారం రాజరాజేశ్వరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. 4వ వార్డు ఇందిరానగర్ కాలనీ కొత్తపేటలో ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. మేళతాళాలు, గరగ నృత్యాలు, విచిత్రవేషధారణలు, బాణసంచా నడుమ అమ్మవారిని ఊరేగించారు. గంగానమ్మ అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో అర్చకుల వేదమంత్రాల నడుమ వైభవంగా తెప్పోత్సవం జరిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో రామలింగేశ్వరస్వామి వారి క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అయ్యప్పక్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా రథోత్సవం

చింతలపూడి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని స్థానిక విశ్వనాధ మఠంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో సాముహిక సత్యన్నారాయణస్వామి వ్రతం జరిపారు. స్థానిక షిర్డీ సాయిబాబ సేవా మందిర్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో పల్లకీ సేవ నిర్వహించారు.

కుక్కునూరు: విజయదశమి వేడుకలు శనివారం మండలంలోని ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. దుర్గానవరాత్రులు చివరిరోజు కావడంతో ఉదయం ఆలయాల్లో ఉద్వాసన పూజ, సాయంత్రం అపరాజిత దేవి పూజ, శమీపూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి మండపాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

టి.నరసాపురం: దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివారం టి.నరసాపురం, బొర్రంపాలెం, వెలగపాడు, గుర్వాయిగూడెం తదితర గ్రామాల్లో అమ్మవార్లకు గ్రామోత్సవాలను నిర్వహించారు. టి.నరసాపురం కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


చింతలపూడి: విశ్వనాథ మఠంలో రాజరాజేశ్వరీ అమ్మవారు


కుక్కునూరు: రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు


ద్వారకాతిరుమల: శ్రీరాజరాజేశ్వరీ దేవిగా కుంకుళ్లమ్మ తల్లి


ద్వారకాతిరుమల: వాసవీమాత రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

'మద్ది'లో కార్తీక ఉత్సవాలకు రాట కార్యక్రమం


మద్దిక్షేత్రంలో రాట కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో వచ్చే నెల 2 నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాస మహోత్సవాలకు సంబంధించి ఆదివారం రాట కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌వీ చందన చేతుల మీదుగా క్షేత్రంలో రాటను వేసి, ఆలయ అర్చకులు, పండితులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, బి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అసిస్టెంట్ కమిషనర్

గురవాయిగూడెం మద్ది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌వీ చందన ఆదివారం ఏలూరులో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. మద్ది అంజన్న చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. మద్ది దేవస్థానంలో భక్తులకు అందిస్తున్న సేవలను ఏసీ చందన ఎమ్మెల్యేకి ఈ సందర్భంగా వివరించారు.